సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం, 11, సెప్టెంబర్, 2023



మూడిళ్లలో చోరీ

పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. - 8లో



ఊరూరా బోనాలు

జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రజలు ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. - 9లో



సేవలందించడమే లక్ష్యం

ప్రజలకు సత్వర సేవలందిడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

భువనగిరిటౌన్ : పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు.రాష్ట్ర హైకోర్టు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కూడా మట్టి వినాయకులను పూజించాలని సూచించాయన్నారు.అందులో భాగంగా మట్టి విగ్రహాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఈకో ఫ్రెండ్లీ క్విజ్ (గణేష్ ఫెస్టివల్) పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. http://tspcbquiz.glensserver.com/#/survey-registration లింకు ద్వారా విద్యార్థుల తమ పేరు, ఈమెయిల్, ఫోన్ నంబర్, జిల్లా, కేటగిరీగా ఎంపిక చేసుకొని రిజిస్టర్ కావాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ రూ.5,000, తృతీయ బహుమతి రూ.3,000 అందజేయనున్నట్లు తెలిపారు. పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు.

ఉత్తమ మండపాలకు ఆహ్వానం

మట్టి గణపతి విగ్రహాలను వాడే మండపాల ఫొటోలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి పోటీల్లో పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాల వారీగా గల ఉత్తమ మండపానికి రూ.10వేల బహుమతి అందజేస్తారని వెల్లడించారు.

టోల్‌ప్లాజాకు వాహనాల తాకిడి



గూడూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

బీబీనగర్ : మండల పరిధిలో హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై గూడూరు టోల్ ప్లాజా వద్ద ఆదివారం వాహనాలు బారులుదీరాయి. రెండు రోజులు సెలవులు రావడం, శుభకార్యాలు ఎక్కువగా ఉండడం, యాదాద్రి పుణ్యక్షేత్రానికి భక్తులు తరలిరావడంతో టోల్ ప్లాజా వద్ద ఉదయం, సాయంత్రం కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. దీనికి తోడు సాయంత్రం భారీ వర్షం కురువడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

పలు మండలాల్లో వర్షం

భువనగిరి టౌన్ : జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి. బీబీనగర్ మండలంలో 21 మి.మీ, భూదాన్‌పోచంపల్లి 19.8 మి.మీ, భువనగిరి 18.8 మి.మీ, వలిగొండ మండలంలో 13.8 మి. మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పోరాట చరిత్రను వక్రీకరించే కుట్ర



అమరవీరుల స్మారక స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ పాలకులు కుట్ర చేస్తున్నారనీ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు గంప వెంకయ్య, ఉంద్రాతి రామయ్య స్మారక స్థూపాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజాకార్ల అమానుషాలను వ్యతిరేకించడంతో పాటు వారికి ఊడిగం చేసిన దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన ధీరత్వం సాయుధ పోరాట యోధులదన్నారు. అటువంటి చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బీజేపీ కుటరలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, కందుల హన్మంత్, గంటెపాక శివకుమార్, తొల్పునూరి శ్రీనివాస్, జోగుల శ్రీనివాస్, బూడిద భిక్షం, జంపాల ఉమాపతి, ఎండీ మైనొద్దీన్, తొల్పునూరి చంద్రశేఖర్, కుక్కడం స్వామి, నోముల రమేష్, మేడి బాషయ్య, సంజీవ, శిరిశాల యాదగిరి, ఉయ్యాల శ్రీనివాస్, మిర్యాల ప్రవీణ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో పూజించారు. ఈ వేడుకలో ఈఓ గీతారెడ్డి పాల్గొన్నారు. ఇక ప్రధానాలయంలో విశేష పూజలు కొనసాగాయి. ఆలయ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, గజవాహనసేవ, బ్రహ్మోత్సవం, వెండి జోడు సేవలు నిర్వహించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.





స్వామి, అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న అర్చకుడు, నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

భువనగిరిటౌన్ : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచిత పోరాటం చేసిన చాకలి ఐలమ్మ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. తాడిత, పీడిత ప్రజల కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ తన ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి పోరాటం చేశారని పేర్కొన్నారు. ఆమె చూపిన తెగువ, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, బీసీ సంఘాల ప్రతినిధులు ఏశాల అశోక్, కదారి వెంకటేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

అందరి దృష్టి వారిపైనే!

- బీఆర్ఎస్ టికెట్ దక్కలేదన్న నిరాశలో మోత్కుపల్లి, భిక్షమయ్య, చింతల
- ఎలాగైనా ఎన్నికల బరిలో నిలవాలన్న యోచన
- మరో పార్టీ వైపు చూపు!
- జిట్టా సైతం పోటీకి సిద్ధం
- ఆసక్తికరంగా నేతల రాజకీయం



సాక్షి, యాదాద్రి : బీఆర్ఎస్‌లో టికెట్ దక్కని నేతల వ్యవహారం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. సీఎం కేసీఆర్ మరోమారు సిట్టింగులకే అవకాశం ఇవ్వడంతో ఇన్నాళ్లు సీటుపై ఆశలు పెట్టుకున్న నాయకులు నిరాశలో ఉన్నారు. ఎలాగైనా ఎన్నికల బరిలో ఉండాలని నిర్ణయించుకున్నందున మరో పార్టీ వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వాళ్లు ఏ పార్టీలో చేరుతారు? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు త్వరలో తొలి జాబితా విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. అయితే బీఆర్ఎస్‌లో తమకు ఎక్కడో ఒక చోట టికెట్ వస్తుందని ఆశపడ్డ మాజీ మంత్రి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నరసింహులు, ఆలేరు మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, సీనియర్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వారితో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక బీజేపీ నుంచి బయటకు వచ్చిన జిట్టా బాలకృష్ణారెడ్డి సైతం ఎన్నికల్లో బరిలోకి దిగనున్నారు. ఈయన కూడా మరో పార్టీ నుంచి పోటీ చేసే యోచనలో ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు కాంగ్రెస్, బీజేపీల తరఫున దరఖాస్తు చేసుకున్న ఆశావహులు సైతం తమకు టికెట్ రాని పక్షంలో ప్రత్యామ్నాం వెతుకునే యోచనలో ఉన్నారు. ఆర్థిక, ప్రజాబలం ఉన్న నేతలు ఇప్పటికే ఆయా పార్టీల అధిష్టానాలతో టచ్‌లో ఉన్నారు.

అవమానంగా భావిస్తున్న మోత్కుపల్లి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మోత్కుపల్లి నర్సింహులు బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడి నుంచి టికెట్ ఇచ్చినా పోటీ చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. కానీ, అధినేత కేసీఆర్ నుంచి ఎటువంటి హామీ లభించలేదు. మాట్లాడడానికి సమయం కూడా ఇవ్వకపోవడాన్ని మోత్కుపల్లి అవమానంగా భావిస్తున్నారు. ఇదే అదనుగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మోత్కుపల్లితో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందిన తుంగతుర్తి నుంచి టికెట్ ఇవ్వడానికి కాంగ్రెస్ సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు సైతం మోత్కుపల్లిని తమ నియోజకర్గం నుంచి పోటీ చేయడానికి ఆహ్వానిస్తున్నారు. అయితే మోత్కుపల్లి మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు.

బలమైన కేడర్ ఉన్నా నిరాశే



ఆలేరు నుంచి 2009లో కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన భిక్షమయ్యగౌడ్ ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. ఈ సారి బరిలోకి దిగాలని ఉన్నప్పటికీ అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ప్రకటించడంతో పోటీ చేసే అవకాశం లేకుండాపోయింది. ఈ క్రమంలో ఆయనపై కాంగ్రెస్ దృష్టి సారించింది. నియోజకవర్గంలో బలమైన కేడర్ కలిగి ఉన్న భిక్షమయ్యను తమ పార్టీ తరఫున బరిలోకి దింపితే ఎలా ఉంటుందని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లో చేరాలని ముఖ్య నేతలు ఆయనపై వత్తిడి తెస్తున్నారు. అయితే అధినేత కేసీఆర్ ఇచ్చిన భరోసాతో భిక్షమయ్య మౌనంగానే ఉన్నారు. అభ్యర్థులను ఖరారు చేసినప్పటికీ స్థానిక పరిస్థితులను బట్టి మార్పులు, చేర్పులు ఉంటాయని ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటనతో ఇంకా ఆశతో ఉన్నట్లు రాజకీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

బీఆర్ఎస్‌లో దక్కని ప్రాధాన్యం



భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చింతల వెంకటేశ్వర్‌రెడ్డి మరోసారి బరిలోకి దిగాలనుకుంటున్నారు. 2000 సంవత్సరంలో జరిగిన ఉప ఎన్నికలో, 2009లో పోటీ చేసి ఓడిపోయారు. కాంగ్రెస్‌లో కీలక నాయకుడిన ఉన్న వెంకటేశ్వర్‌రెడ్డి కొంతకాలం క్రితం బీఆర్ఎస్‌లో చేరారు. భువనగిరి టికెట్ ఆశించినప్పటికీ సిట్టింగ్‌కే ఇవ్వడంతో నిరాశ చెందిన ఆయన.. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో జిల్లా నుంచి ఢిల్లీ వరకు పరిచయాలు కలిగిన చింతల.. ముఖ్య నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో కాంగ్రెస్ గూటికి చేరడమే కాకుండా భువనగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానంటున్నారు.

బీజేపీకి దూరమైన జిట్టా



యువజన సంఘాల సమితి, తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి సైతం కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి సిద్ధం అంటున్నాడు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంతో పాటు భువనగిరి నియోజకవర్గంపై తనదైన ముద్ర ఉన్న జిట్టా.. బీఆర్ఎస్ నుంచి టికెట్ రాకపోవడంతో 2009, 2014లో ఇండిపెండెంట్‌గా, 2018లో యువ తెలంగాణ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తదనంతరం తాను స్థాపించిన యువ తెలంగాణ పార్టీని బీజేపీలో విలీనం చేసి భువనగిరి అసెంబ్లీ టికెట్ ఆశించారు. కానీ, మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన బీజేపీకి కూడా దూరం అయ్యారు. కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే యోచనలో ఉన్నప్పటికీ ఆయన రాకకు ఓ ముఖ్య నేత మోకాలడ్డుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కాంగ్రెస్‌లో ఆయన చేరిక కొంత ఆలస్యమవుతోంది. ఏది ఏమైనా అధిష్టానం ఆశీస్సులతో కాంగ్రెస్ తరఫున టికెట్ వస్తుందన్న ధీమాతో జిట్టా బాలకృష్ణారెడ్డి ఉన్నారు.

ఖిలాపై ఎగిరేది కాషాయ జెండానే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు

వలిగొండ : వచ్చే ఎన్నికల్లో భువనగిరి ఖిలాపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. ఆదివారం వలిగొండ మండలంలోని వెంకటాపురంలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరగా వారికి శ్యాంసుందర్‌రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యమ ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన సాగుతుందన్నారు. 1200 మంది బలిదానాలతో ఏర్పాటైన తెలంగాణ ఫలాలు కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే అనుభవిస్తుందన్నారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్.. అప్పులకుప్పగా మార్చారని దుయ్యబట్టారు. కుటుంబ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించేందుకు బీజేపీ పోరాటం చేస్తుందని, ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించి బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.సెప్టెంబర్ 17న ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. జక్క మళ్చగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సీఎన్ రెడ్డి, రాఘవులు, నరేందర్, రాజశేఖర్‌రెడ్డి, రాచకొండ కృష్ణ, చిరిగే శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఎగురవేస్తున్న శ్యాంసుందర్‌రావు

రాజకీయాలకు అతీతంగా ఆలేరు అభివృద్ధి



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరు రూరల్ : ఆలేరు మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు సమ ప్రాధాన్యం కల్పిస్తూ రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేసినట్లు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి తెలిపారు. ఆలేరు మున్సిపాలిటీలోని 1,2,4, 5,7,8,9,12 వార్డుల్లో సీడీఎఫ్ నిధులతో చేపట్టిన ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాళ్లు, మహిళా సంఘం, మైనార్టీ, యూత్ భవనాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకు తావు లేకుండా వార్డులను విడతల వారీగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆలేరు ఒకప్పుడు ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలే చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తెచ్చినట్లు పేర్కొన్నారు. ఇటీవల రూ.15 కోట్లు మంజూరయ్యాయని, అవసరమైతే మరో రూ.10 కోట్లు తీసుకువచ్చి ఆలేరును ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. నియోజకవర్గలో చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. అనంతరం బృందావన కాలనీలో 100 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కౌన్సిలర్లు బేతిరాములు, కందుల శ్రీకాంత్, ఎర్ర దయామని, జూకంటి శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం, మాజీ సర్పంచ్ దాసి సంతోష్, పత్తి వెంకటేష్, కుండె సంపత్, చింతకింది మురళి, పూల శ్రవణ్, పంతం కృష్ణ, దయ్యాల సంపత్, జూకంతి వెంకటేష్, భరత్, తదితరతుల పాల్గొన్నారు.


మైనార్టీల భద్రతకు చట్టం తేవాలి

- జమియతుల్ ఉలేమా ఆల్ ఇండియా అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మహమూద్ అసాద్ మదనీ

రామగిరి(నల్లగొండ): ఎస్సీ ఎస్టీల మాదిరిగా మైనార్టీల భద్రతకు అట్రాసిటీ యాక్ట్ తేవాలని జమియతుల్ ఉలేమా ఆల్ ఇండియా అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మహమూద్ అసాద్ మదనీ డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ వద్ద జమియతుల్ ఉలేమా నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మౌలానా సయ్యద్ ఎహసానుద్దీన్ ఖాస్మీ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. మత ప్రవక్తలపై కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలను రూపొందించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలని కోరారు. గడిచిన పదేళ్లలో ముస్లింలపై జరిగిన దాడులపై నిష్పక్షపాతమైన విచారణ జరిపించి బాధితులకు సత్వర న్యాయం చేయాలన్నారు. ప్రార్థనా స్థలాలు, మత సంస్థలకు రక్షణ కల్పించాలన్నారు. వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం పరిరక్షించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం మైనారిటీలకు ఎన్నికల్లో టికెట్లు, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. వెనుకబడిన ముస్లింలకు విద్యా ఉద్యోగ రంగాల్లో 4 శాతం రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మత సేవకులకు ఇళ్ల స్థలాలు, నిర్మాణానికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఉర్దూ మీడియం స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సభలో జమియతుల్ ఉలేమా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు హాఫిజ్ పీర్ షబ్బీర్ అహ్మద్, జనరల్ సెక్రటరీ హాఫిజ్ పీర్ ఖలీఖ్ అహ్మద్ సాబిర్, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా అక్బర్ ఖాన్ అసాదీ, ఉపాధ్యక్షుడు ముఫ్తీ సయ్యద్ సిద్దీఖ్ అహ్మద్ మజాహిరి, మౌలానా సయ్యద్ అక్బర్, నిజామాబాద్ మౌలానా ముఫ్తీ సమియుల్లా, భువనగిరి మౌలానా సయ్యద్ అక్బర్ మిఫ్తాయి, మౌలానా ఖలీఖ్ సాహెబ్, మౌలానా తాహెర్, మౌలానా అత్‌హార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మౌలానా సయ్యద్ మహమూద్ అసాద్ మదనీ



నల్లగొండలో జరిగిన జమియతుల్ ఉలేమా సభకు హాజరైన ముస్లింలు

ఇక ఫేస్ రికగ్నైజేషన్

- విద్యార్థుల హాజరు నమోదుకు నూతన విధానం
- జిల్లాలో నేటి నుంచి అమలు
- ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి
- 712 పాఠశాలలు, 57,249 మంది విద్యార్థులు



ఫేస్ రికగ్నైజేషన్ హాజరుకోసం విద్యాశాఖ రూపొందించిన డీఎస్‌సీ ఎఫ్ఆర్‌సీ యాప్

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును కచ్చితంగా తెలుసుకునేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం నూతనంగా తీసుకువచ్చిన ఫేస్ రికగ్నైజేషన్ విధానం జిల్లాలో సోమవారం నుంచి అమల్లోకి కానుంది. ప్రత్యేకంగా రూపొందించిన డీఎస్‌సీ ఎఫ్ఆర్‌సీ యాప్‌లో విద్యార్థుల ఫేషియల్ పాయింట్లు నమోదు చేయనున్నారు. ఉపాధ్యాయుల ఫోన్‌లో ఈ యాప్‌ను ఓపెన్ చేసి విద్యార్థుల ముఖం వైపు చూపితే హాజరు నమోదవుతుంది. ఈ విధానాన్ని మొదట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు.

పాఠశాలలు, విద్యార్థులు ఇలా..

జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 1నుంచి 10వ తరగతి వరకు 57,249 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా పాఠశాలల్లో సోమవారం నుంచి ఫేస్ రికగ్నైజేషన్ అమలు చేయనున్నారు. ఉదయం మొదటి పీరియడ్ ప్రారంభంలో ఉపాధ్యాయులు తమ ఫోన్‌లో అప్‌లోడ్ చేసిన డీఎస్‌సీ ఎఫ్ఆర్‌సీ యాప్ ద్వారా ఫేస్ రికగ్నైజేషన్ హాజరు తీసుకోనున్నారు. మొదటి రోజు తరగతి వారీగా విద్యార్థుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఇదే క్రమంలో విద్యార్థుల ఫేస్‌ను యాప్‌లో నమోదు చేస్తారు. మరుసటి రోజు నుంచి ఒక్కో విద్యార్థి ఫేస్ రికగ్నైజేషన్ కాకుండా తరగతి గదిలో ఒక వైపు ఉన్న బాలికల ఫేస్ రికగ్నైజేషన్ చేయడంతో అందరి ఫొటోలను క్యాప్చర్ చేసే విధంగా యాప్‌ను రూపొందించారు. దీంతో విద్యార్థినులు వచ్చినట్లు యాప్‌లో చూపిస్తుంది. అదే మాదిరిగా బాలుర ఫొటోలు కూడా తీసుకుంటారు. అనంతరం రాష్ట్ర కార్యాలయానికి హాజరు వివరాలు వెళ్తాయి. ఈ విధానం వల్ల ప్రతి రోజూ కచ్చితమైన వివరాలతో విద్యార్థుల హాజరు నమోదుకానుంది. తద్వారా మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర పథకాల్లో అవకతవకలు జరగకుండా ఈ విధానం దోహదపడనుంది.

పాఠశాలలు	విద్యార్థులు
ఎంపీపీ, జెడ్పీ	47,143
కేజీబీవీలు	2,121
రాష్ట్ర ప్రభుత్వ	2,058
టీఎస్ మోడల్	4299
టీఎస్ఆర్ఈఐ సొసైటీ	1,587
అర్బన్ రెసిడెన్సియల్	41
మొత్తం	57,249

మారుమూల గ్రామాల్లో ఎలా..

ఆండ్రాయిడ్ ఫోన్‌లో అప్‌లోడ్ చేసిన యాప్ ద్వారా ఫేస్ రికగ్నైజేషన్ హాజరు నమోదు చేయాలంటే ఇంటర్‌నెట్ సిగ్నల్స్ తప్పనిసరి. మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో నెట్‌వర్క్ సమస్య ఉంటుంది. దీంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు.

కచ్చితమైన హాజరు నమోదు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు నేటినుంచి ఫేస్ రికగ్నైజేషన్ హాజరు విధానం అమలు చేయనున్నాం. ఈ విధానం వల్ల విద్యార్థుల హాజరు ప్రతి రోజూ కచ్చితంగా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇందుకు సంబంధించిన యాప్‌ను వినియోగించే విధానంపై ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సిగ్నల్ సమస్య ఉన్నా హాజరు నమోదు యాప్‌లో నమోదువుతంది. సిగ్నల్స్ రాగానే హాజరు వివరాలన్నీ రాష్ట్ర ఉన్నతాధికారులకు వెళ్లిపోతాయి. పథకాలు పారదర్శకంగా అమలు కావడానికి నూతన విధానం దోహదపడుతుంది.

– నారాయణరెడ్డి, డీఈఓ

క్లుప్తంగా

ఐలమ్మ ఆశయ సాధనకు కృషిచేయాలి



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విమలక్క తదితరులు

రాజాపేట : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని అరుణోదయ సాంస్కృతిక కళాకారిణి విమలక్క అన్నారు. ఆదివారం మండలంలోని జాల గ్రామంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకల్లో ఆమె పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహులు, నాయకులు మొగిలి ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : సూర్యాపేట జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి మహాక్షేత్రంలో గల శ్రీ రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రోచ్చరణాల నడుమ ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామి



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాజ్యసభ సభ్యుడు లింగయ్య యాదవ్

వలిగొండ : దేశంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా ఉందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని మొగిలిపాకలో రూ.10లక్షలతో నిర్మించనున్న యాదవ సంఘం భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాదవుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన నాభిశిల పునప్రతిష్ఠాపనలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు పంజాల రామాంజనేయులు, పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, జిట్టా బాలకృష్ణారెడ్డి వేర్వేరుగా పాల్గొని నాభిశిల పునప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకందారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ దూదిమెట్ల బాలరాజు, పైళ్ల వనిత, ఎంపీపీ నూతి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పైళ్ల రాజావర్ధన్ రెడ్డి, సర్పంచ్ ముద్దసాని శశికళారెడ్డి, ఎంపీటీసీ తుమ్మల వెంకట్‌రెడ్డి, ముద్దసాని కిరణ్‌రెడ్డి, పనుమటి మమతా నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టపగలే మూడిళ్లలో చోరీ

- 9తులాల బంగారం, 25తులాల వెండి, రూ.48వేల నగదు అపహరణ
- సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు



సీసీ ఫుటేజీలో కన్పిస్తున్న దుండగుడు



దొంగతనం జరిగిన మద్ది సుదర్శన్‌రెడ్డి ఇల్లు ఇదే

భూదాన్‌పోచంపల్లి : తాళం వేసిన ఇళ్లలో పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ చోటు చేసుకోగా విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ స్టేజీ వద్ద ఊరుచివరలో మద్ది సుదర్శన్‌రెడ్డి, మద్ది యాదిరెడ్డి, మద్ది రాజిరెడ్డి నివాసం ఉంటున్నారు. వారిలో మద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి తాళం వేసి ఓ శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం 5.40 గంటలకు రాగా ఇంటి తాళాలు పగలకొట్టి నట్లు ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 8తులాల బంగారం, 25తులాల వెండి పట్టాగొలుసులు, 40వేల నగదును గుర్తు తెలియని దుండగుడు అపహరించినట్లు గుర్తించాడు. అలాగే ఇతడి ఇంటి వెనుకాలే ఉంటున్న మద్ది యాదిరెడ్డి కూడా మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లాడు. కాగా దుండగులు యాదిరెడ్డి ఇల్లు ప్రహరీ దూకి ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, 8వేల నగదును ఎత్తుకెళ్లాడు. అనంతరం యాదిరెడ్డి ఇంటి ప్రక్కనే ఉన్న మద్ది రాజిరెడ్డి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న వస్తువులను చిందరవందగా చేశాడు. రాజిరెడ్డి కుటుంబం హైదరాబాద్‌లో ఉంటుండడంతో వారి ఇంట్లో బంగారం, నగదు లభించలేదు.

చోరీ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు..

కాగా మద్ది సుదర్శన్‌రెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసి సీసీ కెమెరాల్లో దుండగుడు చోరీ చేసిన దృశ్యాలన్నీ రికార్డు అయ్యాయి. సుమారు 40ఏళ్ల వయస్సు కలిగిన యువకుడు పాయింట్, టీషర్ట్ ధరించి తన పల్సర్‌బైక్‌ను సుదర్శన్‌రెడ్డి ఇంటి ఆవరణలో చెట్టు కింద పార్కింగ్ చేశాడు. మొదట సుదర్శన్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించాడు. అక్కడ జామ చెట్టు కింద ఉన్న పారతో తాళం విరగ్గొట్టడానికి ప్రయత్నించి విఫలం చెందాడు. అనంతరం మద్ది యాదిరెడ్డి ఇంట్లోకి వెళ్లగా అక్కడ పైప్ రేంచ్‌పానతో ఇంటి గొళ్లాలు విరగ్గొట్టి లోనికి వెళ్లి చోరీ చేశాడు. అలాగే యాదిరెడ్డి ఇంట్లో యాదిరెడ్డికి చెందిన తెల్ల షర్ట్ వేసుకొని తన గీతల టీషర్ట్‌ను మాత్రం భుజం మీద వేసుకొన్నాడు. అనంతరం రాజిరెడ్డి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లోని వస్తువులను చిందరవందరగా చేశారు. మళ్లీ చివరగా మద్ది సుదర్శన్‌రెడ్డి ఇంటికి వచ్చి రెంచ్‌పానాతో గొళ్లెం విరగ్గొట్టి బీరువాను కింద పడేసి అందులోఉన్న సొత్తును చోరీ చేశాడు. అనంతరం బయటికి వచ్చిన దుండగుడు పార్కు చేసిన బైక్‌పై జూలూరు వైపు వెళ్లిపోయాడు. కాగా విషయం తెలుసుకొన్న అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూటీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి ఇంట్లో ఉన్న సీసీ కెమెరాల్లోని సీసీ ఫుటేజీతో పాటు పోచంపల్లి, జూలూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలి



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

- మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో భానుపురి గణేష్ ఉత్సవ కమిటీతో నిర్వహించిన గణేష్ నవరాత్రుల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 18న వినాయక చవితి పండుగ, 27న విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉత్సవ కమిటీకి మంత్రి సూచించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టితో చేసిన గణేష్ విగ్రహాలు ప్రతిష్ఠించాలని ఆయన కమిటీని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి కొత్త చట్టాలను ఏర్పాటు చేసిందని, దీంతో రాష్ట్రంలో 7శాతం గ్రీనరీ అభివృద్ధి జరిగిందన్నారు. పర్యావరణకు మన వంతు బాధ్యతగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలన్నారు. మట్టి విగ్రహాలను వార్డుకు రెండు నుంచి మూడు, ప్రతి ఇంటికి పూజ కొరకు చిన్న మట్టి విగ్రహాలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధికారులు, పోలీసులు, గణేశ్ ఉత్సవ కమిటీలతో నవరాత్రులు విజయవంతంగా నిర్వహించడానికి త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్, డీఎస్పీ నాగభూషణం, ఆర్డీఓ వీరబ్రహ్మచారి, మున్సిపల్ వైస్‌చైర్మన్ పుట్టా కిషోర్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బైరు వెంకన్న, సకిలం రాజేశ్వర రావు, రుక్మారావు, పర్వతం శ్రీధర్, రామిశెట్టి నవీన్, అయుఖాన్, బాలసైదులుగౌడ్, శ్రీనివాస యాదవ్, రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి బాలుడు మృతి



జశ్వన్ మృతదేహం

నాంపల్లి : వైద్యం వికటించి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాన్‌తండా గ్రామానికి చెందిన రామావత్ రత్య సాలీ దంపతుల కుమారుడు జశ్వన్ (14) రెండు రోజులుగా దగ్గు, జలుబుతో బాధపడుతున్నాడు. దీంతో బాలుడిని అతడి తాత ఆదివారం ఉదయం మండల కేంద్రంలోని శ్రీనివాస ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఆసుపత్రిలో ఉన్న ఆర్‌ఎంపీ డాక్టర్ కృష్ణ బాలుడిని పరీక్షించి ఐడోస్ ఇంజక్షన్ నరానికి ఇవ్వడంతో ఒక్కసారిగా స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు చండూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు బాలుడు మృతిదేహంతో బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్ ఘటన విషయంలో జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి రూ.10లక్షల పరిహారం అందించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం బాలుడి మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండకు తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రమావత్ తావుర్యా (ఫైల్)

డిండి : విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కే.గౌరారంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండలంలోని పోల్యానాయక్‌తండాకు చెందిన రమావత్ తావుర్యా (60)కు మండలంలోని కే.గౌరారం గ్రామ రెవెన్యూ శివారులో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే పొలాన్ని వచ్చిన తావుర్యా ఆదివారం ఉదయం బోర్‌మోటార్‌ను ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్‌ఐ.సైదులు తెలిపారు. మృతుడి కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దళిత బహుజనులకు అండగా ఉంటా

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : దళిత బహుజనులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిప్పర్తి పరిధిలోని తిప్పలమ్మగూడెంలో బాల త్రిపుర సుందరి రథయాత్రలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి కరుణ కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉంటాలన్నారు. తిప్పర్తి మండలం అంటే తనకు అమితమైన ప్రేమ ఉందన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. ఎవ్వరికీ ఆపద వచ్చినా ఆదుకుంటానని అన్నారు. కార్యక్రమంలో తిప్పర్తి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బద్దం సుధీర్, మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, గుమ్ముల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

చౌటుప్పల్ : మండలంలోని నేలపట్ల గ్రామ స్టేజీ వద్ద ఉన్న మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్వాహకులు రాత్రి 10గంటల తర్వాత దుకాణం మూసి వెళ్లారు. ఆ తర్వాత అర్ధరాత్రి దాటాక దుకాణం పైకప్పులో ఉన్న సిమెంట్ రేకులను పగులగొట్టిన దుండగులు లోనికిప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.5వేల నగదుతో పాటు 30వేల విలువైన మద్యం ఎత్తుకెళ్లారు. ఆదివారం దుకాణం తెరిచిన నిర్వాహకులు దొంగతనం విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

బురిడీ కొట్టించి బంగారు పుస్తెలతాడు చోరీ



కొంగులో కట్టిన గులక రాళ్లను చూపిస్తున్న బాధితురాలు

భూదాన్‌పోచంపల్లి : మెడలో ఉన్న బంగారాన్ని దొంగలు చూస్తే దొంగిలిస్తారని చెప్పి ఓ వృద్ధురాలిని బురిడీ కొట్టించి ఆమె మెడలో ఉన్న 3తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు దుండగులు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పోతగల్ల పాపన్న అనే వృద్ధురాలు స్థానికంగా ఉన్న ఓ హోటల్ పనిచేస్తుంది. కాగా ఆమె పనిముగించుకొని మధ్యాహ్నం ఇంటికి నడుచుకొంటూ వెళ్తుండగా అన్నపూర్ణ హోటల్ సమీపంలో రోడ్డు పక్కన నిలబడిన గుర్తు తెలియని ఇద్దరు యువకులు పాపన్నను గమనించారు. అందులో ఓ యువకుడు నిన్ను ఓ వ్యక్తి పిలుస్తున్నాడని రోడ్డు పక్కకు రమ్మని అన్నారు. దాంతో ఆమె వారి వద్దకు వెళ్లింది. దీంతో అందుకలో ఒకరు మెడలో బంగారం ఉంటే దొంగలు ఎత్తుకెళ్లారని చెపుతూ అతడి మెడలో ఉన్న గొలుసును తీసి పేపర్‌లో చుట్టి జేబులో వేసుకున్నాడు. నీవు కూడా ఇలానే నీ మెడలో ఉన్న బంగారు గొలుసు తీయమని చెప్పగా, ఆమె మా ఇల్లు దగ్గరనే ఉందని నేను వెళ్లిపోతానని చెప్పింది. దీంతో ఆమెను మాటలతో బురిడీ కొట్టించి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును తీసి పేపర్‌లో చుట్టి ఆమె చీర కొంగులో కట్టారు. ఇంటికి వెళ్లిన తరువాత తిరిగి వేసుకోమ్మని చెప్పి అక్కడ నుంచి పరారయ్యారు. అనుమానం వచ్చిన ఆమె ఐదు నిమిషాల్లోనే అక్కడే కొంగులో కట్టిన పొట్లం విప్పి చూడగా అందులో గులకరాళ్లు కన్పించాయి. దాంతో వృద్ధురాలు బోరున విలపించగా రోడ్డున వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఇంజన్ ఊడి.. ట్రాలీ బోల్తా పడి..

- అక్కడికక్కడే ఇద్దరు మహిళల దుర్మరణం..ముగ్గురికి తీవ్ర గాయాలు
- వనవాసానికి వెళ్లొస్తుండగా దుర్ఘటన



మనిషా, చంద్రమ్మ మృతదేహాలు



ప్రమాదానికి గురైన ట్రాక్టర్ వద్ద గుమిగూడిన స్థానికులు

గరిడేపల్లి : ట్రాక్టర్ ఇంజన్ ఊడి ట్రాలీ బోల్తా పడడంతో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందగా పలువురికి గాయాలయ్యాయి. వన వాసానికి వెళ్లొస్తుండగా సూర్యాపేట జిల్లాలో ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. గరిడేపల్లి మండలం కల్మల్‌చెరువు గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గం ఆదివారం బోనాల పండుక నిర్వహించుకుంది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడకు చెందిన గోలి చంద్రమ్మ (38) కూడా వచ్చింది. ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించిన తర్వాత ఆ సామాజిక వర్గంలోని మూడు కుటుంబాల వారు సుమారు 20మంది ట్రాక్టర్‌లో కల్మల్‌చెరువు గ్రామ శివారులోని తమ వ్యవసాయ భూముల వద్దకు వన వాసానికి వెళ్లారు. అక్కడ వేడుక ముగిసిన తర్వాత అందరూ ట్రాక్టర్‌లో గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో జోరుగా వర్షం కురుస్తుండడంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను వేగంగా నడిపాడు. మార్గమధ్యలోని ఒంపు ప్రాంతానికి రాగానే ట్రాక్టర్ ఇంజన్ వేరై ట్రాలీ బోల్తాపడింది. ప్రమాదంలో కల్మల్‌చెరువుకు చెందిన మనీషా(28)తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడకు గోలి చంద్రమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఇదే గ్రామానికి చెందిన మీసాల సైదులు, మీసాల ఫాతిమా, బిల్లా కనకయ్యలకు తీవ్ర, పలువురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మూడవ సారి అధికారం బీఆర్‌ఎస్‌దే

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట : రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ఎన్.డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆలేరు మండలంలోని బైరాంనగర్, శర్బనాపురం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల యువకులు ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలో గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతుందన్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఉచితంగా గొర్రెలను పంపిణీ చేసి గొల్ల కురుమల సంక్షేమానికి పాటుపడుతున్నారని కొనియాడారు. పార్టీలో కొత్త, పాత లేకుండా అందరూ సమన్వయంతో ముందుకు సాగాల కోరారు. పాల సంఘం మాజీ చైర్మన్ గవ్వల ప్రభాకర్, నంద సంతోష్ కుమార్, కురుమ సంఘం అధ్యక్షుడు గవ్వల గణేష్, మాజీ అధ్యక్షుడు గవ్వల యాదగిరి, కార్యదర్శి నంద శ్రీను, డీవైఎఫ్ఐ కార్యదర్శి ఏదూ సాయితో పాటు మరో 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ మొగలిగాని మల్లేష్ గౌడ్, పార్టీ కోశాధికారి మహేందర్, సీనియర్ నేత ఎం ప్రవీణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు అంగడి బిక్షపతి, వార్డు సభ్యుడు బోడ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాడి ఎద్దులను ఢీకొని వ్యక్తి మృతి

మునుగోడు : రోడ్డుపై వెళ్తున కాడీ ఎద్దులను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మండలంలోని కొంపల్లి సమీపంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన మార్ల కృష్ణయ్య(44) తన భార్య, కుమార్తైతో కలసి మునుగోడులోని శుభకార్యానికి సాయంత్రం 6గంటల సమయంలో తన బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో కొంపల్లి గ్రామ సమీపంలో ఓ రైతు తన వ్యవసాయ భూమిలో గుంటకతోలి కాడి ఎడ్లతో ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కృష్ణయ్య తన బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఎడ్లపై ఉన్న కాడి విరిగిపోయి ఆ కాడిపై ఉన్న గొర్రు ఇనుపరాడ్లు కృష్ణయ్య కడుపులో బలంగా గుచ్చుకున్నాయి. అదే విధంగా బైక్‌పై ఉన్న భార్యతో పాటు కుమార్తై తలకు బలంగా గాయాలయ్యాయి. విషయం తెలిసిన బంధువులు వెంటనే అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం హైదరబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో కృష్ణయ్య మృతి చెందగా, గాయపడిన భార్య, కుమార్తైలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిందితులను పట్టించిన ఆధార్ కార్డు



కూరెళ్లలో సీసీ ఫుటేజీలో రికార్డు అయిన నిందితుల ఫొటోలు (ఫైల్)

ఆత్మకూరు(ఎం) : ఓ చోరీ కేసులో నిందితులను పట్టించడంలో ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నంబర్ కీలకంగా మారాయి. దీంతో పోలీసులు సకాలంలో చోరీ కేసును చేధించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కూరెళ్ల గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుక్కాపురంలో ఈనెల 4న పొనగాని స్వామి ఇంట్లో మాయమాటలు చెప్పి సినీఫక్కీలో చేసిన చోరీ కేసును సకాలంలో పోలీసులు చేధించారు. పోలీసులు చోరీ కేసును చేధించేందుకు నాలుగు రోజుల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 1న తుక్కాపురం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కూరెళ్లలో మూడు సంచార జాతుల కుటుంబాలు దిగాయి. వారు తాత్కాలిక నివాసం కోసం అనుమతి ఇవ్వాలంటూ కూరెళ్ల గ్రామ సర్పంచ్ ఉప్పలయ్యయాదవ్ ఇంటికి వెళ్లి అడిగారు. దీంతో సర్పంచ్ వారి ఆధార్‌కార్డులు ఇవ్వాలని కోరడంతో వారి ఆధార్‌కార్డును సర్పంచ్‌కు అందజేశారు. తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకున్న అనంతరం వారిలో లలిత అనే మహిళ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సెల్ ఫోన్ నుంచి వారి బంధువులకు ఫోన్ చేసింది. తుక్కాపురంలో చోరీ సంఘటన అనంతరం తాత్కాలిక నివాసాలు కనిపించకపోవడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. అప్పటికే గాలింపు చర్యలు ముమ్మరం చేసిన పోలీసులకు సర్పంచ్ ఉప్పలయ్యకు వారు అందజేసిన ఆధార్ కార్డు కీలకంగా మారింది. అంతే కాకుండా లలిత అనే మహిళ గ్రామస్తుడి సెల్ ఫోన్ నుంచి ఎవరికి ఫోన్ చేశారన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. దీనికి తోడు గ్రామంలో నమోదైన సీసీ ఫుటేజీలను పరిశీలించి మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని పోలీసులు పట్టుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెద్దవూర : ఓ గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. లింగంపల్లి గ్రామానికి చెందిన కట్టెబోయిన రామలింగయ్య(50) ఆదివారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై అనుముల గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో గ్రామ సమీపంలోకి రాగానే కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం అతడి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రామలింగయ్య బైక్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు.

చెట్టును ఢీకొని విద్యార్థి దుర్మరణం

కనగల్ : రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్ని ఓ విద్యార్థి గాయపడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన నల్లగొండ పట్టణంలోని సాగర్‌రోడ్డు భాగ్యనగర్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బుడుమర్లపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌మెన్ పోలె ఏల్లేష్‌స్వప్నలకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు పోలే లోహిత్ (15) భాగ్యనగర్‌లో వారి నివాసంలో ఉంటున్నాడు. లోహిత్ నోట్‌పుస్తకం కోసం తన స్నేహితుడి వద్దకు రాత్రి 9గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి స్కూటీపై వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు రోడ్డు కనపడక ప్రమాదశాత్తు రోడ్డు పక్కన గల కానుగు చెట్టుకు స్కూటీతో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టూ పక్కల వారు గమనించి లోహిత్‌ను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. లోహిత్ నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

యాదాద్రిలో భక్తుల రద్దీ



ప్రధానాలయంలో భక్తుల రద్దీ



ప్రధానాలయం వీధుల్లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు, శ్రావణమాసం కావడంతో భక్తులు అధికంగా శ్రీస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట, నిత్య కల్యాణ మండపం వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. ధర్మ దర్శనానికి సుమారు నాలుగు గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టినట్లు భక్తులు వెల్లడించారు. శ్రీస్వామిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.62,34,255 వచ్చినట్లు అధికారులు తెలిపారు.